بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْد

# Summary of Friday Sermon Huzur-e-Anwar 13.03.2015 (Telugu)

**మసీహ్ మరణ సమస్య కేవలం అభిప్రాయమునకు చెందినది కాదు. దైవ ఏకత్వ స్థాపనకు అది తప్పనిసరి. ఈ సమస్య ఇస్లాంకు తీవ్ర నష్టము కలిగించినది. దీనిని అంతము చేయనిదే మేము విశ్రాంతి తీసుకోలేమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. అల్లాహ్ ప్రేమ, ఇస్లాంను వ్యాపింపజేయు కలత ఎవరి హృదయములోనైనా యున్నచో అది హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హృదయములో యున్న నిప్పరవ్వేనని గుర్తించవలెను.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 13.03.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధమున్న పలు విషయములను హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు ప్రస్తావించిరి. వాటిని ఇప్పుడు నేను తెలిపెదను. వీటిలో అనేక గుణపాఠములు గలవు. వీటిలో నేడు కూడ మార్గదర్శక సూచనలు మనకు లభించును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం హృదయములో ఇస్లాం ప్రచార ఉత్సాహము, కలత ఎంత యుండెనో దానిని వారు జమాఅత్ సభ్యులలో కూడ చూడాలని ఆశించేవారు. ఈ విషయము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అభిప్రాయములను ప్రస్తావించుచు వారిట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ప్రచారము గురించి చిత్ర విచిత్ర ఆలోచనలు కలిగేవి. ఈ సందేశము ప్రపంచ నలు మూలల వరకు వ్యాపించాలనే ఆలోచనలో వారు నిమగ్నమై యుండేవారు. మన జమాఅత్ వస్త్రధారణ విభిన్నముగా యుండినచో ప్రతి ఒక్కరి ఉనికి ప్రచారమగునని వారొక సారి భావించిరి. అనగా ఇతను అహ్మదీ అని గుర్తుపట్టవచ్చును. కాని ఒక విభిన్న గుర్తింపు నిరుపయోగమగును. ఒక విభిన్న వస్త్రధారణ చూచి, ఆచరణ, విశ్వాసపర స్థితిని చూచి తనకు కూడ నేను అహ్మదీయునిగా గుర్తింపబడుదును, కనుక ఆచరణ, విశ్వాసపరంగా సక్రమంగా యుండాలని ఆలోచించును. నేడు కూడ వస్త్రధారణకు ఎలాంటి ప్రాధాన్యత, ప్రాముఖ్యత లేదని మనము గమనించవలెను. ఇతడు అహ్మదీ, ఇతరుల కంటే భిన్నుడని మమ్ములను చూచి భావించవలెను.

ప్రచారమునకు ప్రచారకుని రూపురేఖలు విశ్వాసుని వలె యుండవలెను. ఇస్లాం ఆచారముల ప్రకారము

వారి బాహ్య రూపురేఖలు యుండవలెనని నేను యువకులకు సూచించుచున్నాను. వారు తమ గడ్డము, కేశములు, దుస్తులలో సాధారణముగా యుండవలెను. శుభ్రమైన, అందమైన దుస్తులను ధరించుటను ఇస్లాం అవరోధించదు. బాహ్య పరిశుభ్రతను పాటించుము, అపరిశుభ్రత నుండి దూరముండుమని అది స్వయముగా అదేశించును. కాని దుస్తులకు కష్టపడడం సముచితం కాదు. బాహ్య రూపు రేఖల గురించి అసలు ఉద్ధేశము మరుగున పడేంత ఆడంబరము పాటించకూడదని ప్రచారకులు, జీవితార్పితులకు, ఇతర సాధారణ సభ్యులకు ఇందులో ఉపదేశము గలదు. కొందరు పరిశుభ్రతను పాటించరు. పరిశుభ్రత విశ్వాసములోని ఒక భాగమని అటువంటి వారు గుర్తించు కోవలెను. ప్రతి విషయములో మధ్యేమార్గమును అవలంభించవలెను.

తమ ఢిల్లీ ప్రయాణము సందర్భమున జరిగిన ఒక ప్రచార సంఘటనను వారిట్లు తెలిపిరి. నాకింకా గుర్తున్నది. నేనిక్కడికి వచ్చి నా బంధువుల వద్ద బసచేసినాను. హైద్రాబాదాద్‌నకు నివాసి వరుసకు సోదరుడైన ఒకరు అమ్మాజాన్ బసచేసిన చోట మా అమ్మమ్మను చూడడానికి వచ్చిరి. మీ తండ్రి ఎంతో గందరగోళాన్ని సృష్టించినారు. ఇస్లాంనకు వ్యతిరేకముగా చాలా మాటలు మాట్లాడుచున్నారని వారనిరి. నేను ఆందోళన చెందే బదులు మసీహ్ మరణము గురించి నాకు చాలా తెలిసినందున మసీహ్ మరణ సమస్యను చర్చించడం మొదలు పెట్టినాను. దాని గురించి నేను చాలా విస్తారముగా తెలిపినందున వారు చాలా ఆశ్చర్యమునకు లోనై హజ్రత్ ఈసా అలైహిస్సలాం నిజముగానే మరణించినారని మీ మాటలతో స్పష్టమగుచున్నదని వారనిరి. అటులైనచో ఈ మౌల్వీలు ఎందుకు అల్లరి చేయుచున్నారు ? అని అనిరి. ఈ విషయమును ఆ మౌల్వీలనే అడగగలరని నేనన్నాను. కాని అమ్మమ్మ స్పందన ఎట్లుండెను. పశ్చత్తాప పడుము! పశ్చత్తాప పడుము! ఈ విషయములను విని ఈ బాలుని మెదడు ఇంతకు ముందే చెడిపోయెను. ఇప్పుడు ధృవీకరించి అతన్ని అవిశ్వాసములోకి నెట్టివేసితివని అనిరి.

ప్రచారము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక అనుచరుని పద్ధతిని ఇట్లు తెలిపిరి. మియా షేర్ ముహమ్మద్ గారు నిరక్షరాస్యులు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రాచీన అనుచరులలో పరిగణింపబడుదురు. టాంగా నడిపేవారు. ప్రయాణికున్ని టాంగాలో కూర్చోబెట్టుకొని టాంగా నడుపుచు ప్రయాణికులతో మాట్లాడడం మొదలు పెట్టేవారు. వారు అల్‌హకమ్ పత్రిక తెప్పించేవారు. మీలో ఎవరైనా చదువుకున్నారా అని ప్రయాణికులను అడిగేవారు. చదువుకున్నవారు యున్నచో ఈ పత్రిక నా పేరున వచ్చినది. దీనిని చదివి వనిపించగలరని అనేవారు. ఈ సంఘటనను వారు నాకు వినిపించిరి. ఈ విధముగా డజను కంటే అధికముగా వారి ద్వారా అహ్మదీయులైరి.

అల్లాహ్ వైపు ఆహ్వానము కొరకు విద్యతో కూడిన చర్చలు, పెద్ద పెద్ద సమావేశములు, సభలు అవసరం లేదు. పరిస్థితులను బట్టి పద్ధతులను అవలంభించవలెను. ఈ కాలములో కూడ అనేక అహ్మదీయులు ప్రచారము కొరకు వివిధ పద్ధతులను పాటింతురు. అల్లాహ్ కృపానుసారము సఫలము కూడ అగుచున్నారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ గారి సంయుక్త మిత్రుని ఒక సంఘటనను ఇట్లు తెలిపిరి. వారి పేరు నిజాముద్దీన్. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతార ప్రకటన చేసినప్పుడు మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ వారిని అవిశ్వాసులుగా ప్రకటించిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యముపై వారికి అపార నమ్మకమున్నందున అప్పుడు వారి మిత్రునికి చాలా బాధ కలిగెను. వారొక రోజు ఆలోచించుకొని లుధ్యానా నుండి ఖాదియాన్‌కు వచ్చిరి. రావడంతోనే మీరు ఇస్లాంను వీడినారా ? ఖుర్‌ఆన్‌ను తిరస్కరించిరా ? అని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ప్రశ్నించిరి. ఇదెలా సాధ్యమగునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనిరి. ఖుర్‌ఆన్‌ను నేను విశ్వసింతును, ఇస్లాం నా ధర్మము. హజ్రత్ ఈసా అలైహిస్సలాం ఆకాశమునకు పోయినారని పవిత్ర ఖుర్‌ఆన్ నుండి నేను పది సూక్తులు చూపినచో మీరు నమ్ముదురా అని అడిగిరి. నాకు ఇటువంటిది ఒక్క సూక్తి చూపినా నేను విశ్వసింతునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనిరి. ఆ రోజులలో మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ లాహోర్‌లో యుండిరి. హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి) అక్కడే యుండిరి. మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ – హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మధ్య ఒక చర్చ జరగనున్నందున నిబంధనల రూపకల్పనకు వారక్కడి పోయి యుండిరి. ఇదే క్రమంలో మియా నిజాముద్దీన్ గారు అక్కడికి చేరుకొని అట్లనిరి. ఇప్పుడు అన్ని చర్చలను పక్కకు పెట్టుము. పవిత్ర ఖుర్‌ఆన్ నుండి ఈసా అలైహిస్సలాం జీవించియున్నారని తెలుపు పది సూక్తులను చూపినచో వారు ఈసా అలైహిస్సలాం సజీవముగా యున్నారని నమ్ముదురనే వాగ్దానము నేను వారితో తీసుకొని వచ్చినాను. మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ స్వభావములో చాలా కోపము యుండెను. వారు తొందరపడేవారు. కనుక ఇట్లనిరి. దురదృష్టుడా! నీవు నా కార్యమును మొత్తం నాశనం చేసితివి. రెండు నెలల నుండి నేను సంభాషించుచు వారిని హదీస్ వైపు తీసుకొచ్చితిని. ఇప్పుడు మరల నీవు ఖుర్‌ఆన్ వైపు తీసుకెళ్లినావు. మియా నిజాముద్దీన్ గారిట్లనిరి. ఓహో! పది సూక్తులు కూడ మిమ్ములను ధృవీకరించడం లేదా? అటులైనచో ఖుర్‌ఆన్ యున్న వైపే నేను కూడ. ఇట్లని వారు ఖాదియాన్ వచ్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హస్తమున బైఅత్ చేసిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, అహ్మదియ్య జమాఅత్‌తో పవిత్ర ఖుర్‌ఆన్ యున్నదని ప్రతి అహ్మదీయుడు ధైర్యముతో యుండవలెను. పవిత్ర ఖుర్‌ఆన్ ఈ ధృవీకరణయే సత్యస్వభావము గల వారి హృదయములను ప్రకాశవంతము చేయుచు జమాఅత్ సంఖ్యను పెంచుచున్నది.

వ్యతిరేకత కూడ మార్గదర్శనమునకు కారణమగునని వారిట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దకు ఒక మిత్రుడు వచ్చి బైఅత్ చేసిరి. మీకెవరు సందేశమందించినారని హుజూర్ (అ) అడిగిరి. నాకు మౌల్వీ సనావుల్లాహ్ గారు సందేశమందించినారని నిస్సంకోచముగా వారనిరి. అదెలా అని వారు ఆశ్చర్యముతో అడిగిరి. వారిట్లనిరి. మౌల్వీ గారి పత్రిక, పుస్తకములను నేను చదివేవాడిని. వీటిలో అహ్మదియ్య జమాఅత్‌నకు వ్యతిరేకత యుండెడిది. స్వయముగా నేను కూడ ఈ సంస్థ పుస్తకములను చదవాలని ఆలోచించి చదవడం మొదలు పెట్టినాను. తద్వారా నాకు సత్యము తెలిసి నేను బైఅత్ చేయుటకు సన్నద్ధమైనాను.

అహ్మదీ అయిన తర్వాత ఏ విధముగా అల్లాహ్ నిరక్షరాస్యునికి కూడ వివకేము ప్రసాదించునో, అతడు ఎలా తక్షణమే సమాధానమిచ్చునో తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక సంఘటనను ఇట్లు తెలిపిరి. వరుసలో మాకు చిన్నాన అయ్యే ఒకరు కేవలం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

వ్యతిరేకత, వారి ప్రకటనను అవమానించుటకు తాను ముఘల్ వంశమునకు చెందినను తమను తాము దళితుల గురువుగా ప్రచారము చేసుకొనిరి. ఊడ్చేవారిలో కొందరు ముస్లిములైనవారు ఇక్కడికి వచ్చిరి. వారు నిరక్షరాస్యులు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాంలో ఈ జాతి మూర్ఖులుగా యెండెడిది. మిర్జా గారు మీకేమిచ్చినారని మా చిన్నాన వారిని ప్రశ్నించెను. వారిట్లు సమాధానమిచ్చిరి. మాకు ఎక్కువ ఏమి తెలియదు. కాని మాకు తెలిసినంత వరకు మమ్ములను గతములో దళితులు అని పిలిచేవారు, కాని మిర్జా గారితో బంధము ఏర్పడిన తర్వాత మేము మిర్జాయి అనబడుచున్నాము. అనగా మేము దళితులమైనను వారి వలన మిర్జాయి అయినాము. కాని మీరు ఇంతకు ముందు మిర్జాయిగా యుండిరి. కాని మిర్జా గారి వ్యతిరేకత వలన దళితులైరి.

అహ్మదీయుల విధేయత విచిత్ర పద్ధతి, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దైవవాణిని పూర్తి చేయు అభిలాష, అహ్మదియ్యత్ వలన శత్రుత్వమును ఎదుర్కొనుట, అహ్మదియ్యత్ వల్లనే శత్రుత్వము ప్రేమలో మారి పోవు ఒక సంఘటనను హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి. చాలా గుజ్రాతీయుల ముఖములు నాకింకా గుర్తున్నవి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం يَأْتِيْكَ مِنْ كُلِّ فَجٍّ عَمِيْقٍ అను దైవవాణిని పూర్తి చేయుటకు నడుచుకుంటూ ఖాదియాన్ వచ్చేవారు. ఇది జిల్లా గుజ్రాత్ నివాసుల సంఘటనే. దీనిని కీ.శే. హాఫిజ్ రౌషన్ అలీ గారు వినిపించేవారు. వార్షిక సభ (జల్స సాలానా) రోజులలో ఒక పక్షము ఒక వైపు నుండి మరో పక్షము మరో వైపు నుండి వచ్చుచుండెను. ఆ రెండు పక్షములు తారసపడినప్పుడు రోధించసాగిరి. మీరెందుకు రోధించుచున్నారు ? అని నేనడిగినాను. మాలోని ఒక పక్షము మొదట విశ్వసించినందున రెండవ పక్షము వారిని ఎంతో హింసించెను. ఫలితముగా వారు గ్రామమును వీడక తప్పకలేదు. కొంత కాలము తర్వాత అహ్మదియ్య కాంతిని అల్లాహ్ మాలో వ్యాపింపజేసెను. ఇప్పుడు మేము ఇక్కడికి చేరినప్పుడు దైవికముగా అల్లాహ్ వివేకము మేరకు మేము గృహముల నుండి తరిమికొట్టిన సోదరులు రెండవ వైపు నుండి వచ్చిరి. వారిని మేము చూడగానే మా హృదయములు బాధాతప్త భావములతో నిండిపోయినవి. కనుక మేము భావాలకు లోనై రోధించడం మొదలు పెట్టినాము. తప్పి పోయిన వారిని కలుపు అహ్మదియ్య సంఘ శుభములలో ఒకటి. షైతాన్ విడగొట్టిన వారిని అహ్మదియ్యత్ మరల కలుపును. ఇప్పుడు కూడ ఇటువంటి దృశ్యములు మరల పునరావృతం అగును. ఇన్షాఅల్లాహ్.

హజ్రత్ మసీహ్ అలైహిస్సలాం స్వహస్తముతో పక్షులను పుట్టించేవారనే విషయమును మౌల్వీలు సాధారణ ముస్లిములలో వ్యాపింపజేసిరి. ఇటువంటి అభిప్రాయము కలిగిన ఒక మౌల్వీ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో సంభాషించుచుండెను. ఏ పక్షులను అల్లాహ్ పుట్టించినాడు, ఏ పక్షులను మసీహ్ పుట్టించినాడో మీరు గుర్తు పట్టగలరా ? అని హుజూర్ (అ) వారిని ప్రశ్నించిరి. సమాధానముగా ఆ మౌల్వీ గారిట్లనిరి. ఆ కార్యము ఇప్పుడు చాలా కష్టతరమైనది. ఎందుకనగా అల్లాహ్ పుట్టించిన, మసీహ్ పుట్టించిన పక్షులు పరస్పరం కలిసిపోయినవి. ఇప్పుడు వాటిని గుర్తు పట్టడం ఎంతో కష్టము.

క్రైస్తవులకు వ్యతిరేకంగా వారు కఠిన పదాలను వాడినారని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గురించి నిందారోపణ చేసేవారు. కాని గమనించినచో వాస్తవము మరోలా యున్నది. వారు స్వయముగా

ఎన్నడు మొదలు పెట్టలేదు. హ(జత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. విషయము శ్రుతి మించినప్పుడు కొన్ని సందర్భాలలో ఆయా మాటలకు సమాధానము కూడ ఇవ్వవలసి వచ్చును. క్రైస్తవులు సదా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంపై దాడులు చేసేవారు. ముస్లిములు వారి దాడులకు సమాధానము ఇచ్చేవారు కాదు. కనుక ఇస్లాం స్థాపకులలో లోపాలున్నాయని వారు భావించేవారు. లోపరహితమైన మతము ఏదైనా యున్నదంటే అది యేసు ఉనికి అని భావించేవారు. ముస్లిముల మంచితనమును వారు తప్పుగా భావించేవారు. మేము ఆరోపించినను వారు ఆరోపించరు అందుకే వారి నాయకునిలో లోపాలున్నాయని వారు భావించేవారు. ఏడు, ఎనిమిది శతాబ్దముల వరకు క్రైస్తవులు నీచమైన దాడులు చేసిరి. తుదకు అల్లాహ్ మీలో మాకు ఏదైనా లోపము కనిపించుచున్నదా లేదా అని తెలుపుటకు హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు అనుమతి ఇచ్చెను. కనుక యేసును ఉద్దేశించి యూదులు లేదా క్రైస్తవుల పుస్తకములలో వ్రాసియున్న విషయములను హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వ్రాయడం మొదలు పెట్టిరి. ఇటువంటి రెండు, మూడు పుస్తకములు హుజూర్ (అ) వ్రాయగానే ఈ పద్ధతి మంచిది కాదని క్రైస్తవ ప్రపంచము మొత్తం ఆందోళన చేపట్టెను. అప్పుడు హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మీ పద్ధతి సమంజసమైనది కాదని మేము మీకు తెలిపితిమి. కాని మీరు అంగీకరించలేదు. తుదకు మీపై ఒత్తిడి పడగానే మీకు తెలిసివచ్చినది. హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కొన్ని సార్లు ఉపయోగించిన కఠిన పదములు దాడి చేయుటకు కాక సమాధానము కొరకు ఉపయోగించినారు.

పంజాబ్‌లోని ఒక గొప్ప వైద్యునికి హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో చాలా మంచి విశ్వాసపూరిత బంధము యుండెను. కాని వారు బైఅత్ చేసేవారు కాదు. వారి గురించి ఒక ఆసక్తికరమైన సంఘటన హ(జత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. వారి పేరు హాకీముల్లాహ్ దీన్. ఒక సారి వారి వద్దకు మౌల్వీ హాకీమ్ ఫజల్ దీన్ భేర్వీ గారు పోయిరి. వారు కొంత సందేశము అందించిరి. హాకీమ్ గారిట్లనిరి. మీరు నాకు మసీహ్ మరణ సమస్య తెలుపుటకు వచ్చినారు. అసలు విషయము ఏమనగా మిర్జా గారు బరాహీనె అహ్మదియ్య పుస్తకము రచించిరి. పదమూడు వందల సంవత్సరములలో ఏ ముస్లిం ఇటువంటి పుస్తకము రచించలేదు. మౌల్వీలు అతి బుద్ధిహీనులు, మూర్ఖులైనందున వారికి కృతజ్ఞతలు తెలిపే బదులు వారిని అవిశ్వాసులని ప్రకటించిరి. ఇస్లాం ఇంతటి గొప్ప సేవను వారిచే చూచినను వారికి వ్యతిరేకంగా అవిశ్వాస ప్రకటనలు చేసి తమ విద్యను ప్రదర్శించడం మొదలు పెట్టిరి. దీని వలన మిర్జా గారికి కోపము వచ్చెను. అనగా హాకీమ్ గారు తమ నిదర్శనము ఇచ్చుచున్నారు. మీరు గొప్ప విద్యావంతులని గర్వపడుచున్నారు. మీకు మీ విద్యపై ఇంత గర్వమున్నచో మసీహ్ సజీవముగాయున్న విశ్వాసము ఖుర్‌ఆన్‌తో నిరూపితమైనది. దానికి వ్యతిరేకంగా మసీహ్ మరణమును నిరూపించుట చాలా కష్టము. కాని నేను ఖుర్‌ఆన్ నుండే మసీహ్ మరణమును నిరూపించెదను. మీకు ధైర్యమున్నచో దీనిని ఖండించి చూపగలరు. మౌల్వీలకు వారి మూర్ఖత్వము చూపుటకు మసీహ్ మరణ సమస్యను ప్రవేశపెట్టిరి. ఇందుకు ఖుర్‌ఆన్ నుండి సాక్ష్యములు చూపడం మొదలు పెట్టిరి. హాకీమ్ గారు మరల ఇట్లనిరి. వాస్తవానికి మసీహ్ మరణ సమస్య అవాస్తవమైనది కాదు. మసీహ్ సజీవిముగా యున్నారు. మౌల్వీలను ఒప్పించుటకు ఇప్పుడు ఒకే

మార్గము గలదు. మౌల్వీలందరు కలిసి హజ్రత్ మిర్జా గారి వద్దకు పోయి, వారితో ఇట్లనవలెను. మిమ్ములను అవిశ్వాసులని ప్రకటించి మేము పెద్ద తప్పు చేసినాము. మమ్ములను క్షమించగలరు. మిర్జా గారు ఖుర్ఆన్ నుండే మసీహ్ సజీవముగా నున్న విషయమును తీసి చూపుదురా లేదా చూడగలరు. దీనిని కూడ వారు తమ ఇష్టానుసారము వివరించిరి.

అభిమానమున్నను మసీహ్ సజీవముగా యున్నారనే విశ్వాసము గట్టిగా కలిగియున్నందున వారు బైఅత్ చేయలేక పోయినారను విషయమును గమనించవలెను. వర్తమాన ఇమామ్‌ను విశ్వసించే అనుగ్రహము అల్లాహ్ కరుణించిన వారికే లభించును. మసీహ్ మరణ సమస్య కేవలము అభిప్రాయమునకు చెందినది కాదు. దైవ ఏకత్వ స్థాపనకు అది తప్పనిసరని మనము సదా గుర్తుంచుకోవలెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు నాకింకా ఒక విషయము గుర్తున్నదని తెలుపుచు ఇట్లనిరి. ఈ సమస్యను వీడగలరని ఒక సారి ఎవరో ఒకరు సూచించగా హుజూర్ ఆగ్రహించి ఇట్లనిరి. దీని గురించి నాకు కొన్ని సార్లు ఎంత ఉత్సాహము కలుగుననగా నేను మతిస్థిమితం కోల్పోతానని భావింతును. ఈ సమస్య ఇస్లాంకు తీవ్ర నష్టము కలిగించినది. దీనిని అంతము చేయనిదే మేము విశ్రాంతి తీసుకోలేమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. ఇదేదో సమస్య కాదని కొందరందురు. కాని ఇది దైవ ఏకత్వ మార్గములో అవరోధముగా నున్నది. దీనిని దూరము చేయుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఎంతో ఉత్సాహము యుండెను. ఇదే ఉత్సాహము అల్లాహ్ ప్రేమను ఆకర్షించి, సత్యమును స్థాపించెను. అల్లాహ్ ప్రేమ, ఇస్లాంను వ్యాపింపజేయు కలత ఎవరి హృదయములోనైనా యున్నచో అది హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హృదయములో యున్న నిప్పురవ్వేనని గుర్తించవలెను.

మన ప్రపయత్నములు, ఈ బిందువు చుట్టు తిరగవలెను. దీనినే కేంద్రీకరించవలెను. ఈ విషయమును మనము అర్థము చేసుకొననిచో మనము చేయుచున్న పనులు దైవ ఏకత్వముతో కూడినవైనను వాటిలో అన్యారాధనకు ఆస్కారముండును. దైవ ఏకత్వము అయినను అన్యారాధనకు ఆస్కారమెలా అగునను విషయమును వివరించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ప్రజలు ఏకత్వము (వహ్దానియ్యత్) వరకు పోవుదురు కాని ఒంటరి (అహ్దియ్యత్) వరకు పోరు. ఈ రెండు విషయములు అనగా వహ్దానియ్యత్, అహ్దియ్యత్‌లను అర్థము చేసుకోవలెను. వహ్దానియ్యత్ అనగా లక్షణములలో ఏకత్వము. అల్లాహ్ లక్షణములలో ఒక స్థాయి వరకు మానవుడు కూడ భాగస్వామి అగును. అందుకు అతి గొప్ప ఉదాహరణ మానవులలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉనికి. కాని లక్షణములలో సంపూర్ణుడు అల్లాహ్ మాత్రమే. అహద్ అనగా అల్లాహ్ ఒంటరి వాడు. ఒంటరి ఉనికికి ఎదురుగా ఇతర ఉనికి ఆలోచనే రాదు. కనుక అహ్దియ్యత్ వాస్తవమును అర్థము చేసుకున్నప్పుడే నిజమైన దైవ ఏకత్వము ఏర్పడును. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఉద్దేశములను పూర్తి చేయుచు దేవ ఏకత్వమును ఏర్పరచుటకు అల్లాహ్ మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్)

✡ ✡ ✡

*Translated By Hafiz Syed Rasool Niyaz For Telugu Desk*

From: Nazarath Nashr-O-Isha'ath, Qadian, Distt:Gurdaspur, Pin:143516, Punjab